క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



చెన్నారావుపేట : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పులి దేవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. జీఓ నంబర్ 317 బాధితులకు న్యాయం చేయడంతోపాటు పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, బదిలీలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా బాధ్యుడు నర్సింహులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడికి అభినందన



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఈదులకంటి రవీందర్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కలిసి అభినందించారు. శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఈ మేరకు ఎస్సై వీరభద్రరావు వివరాలు వెల్లడించారు. మహిళ చామనచాయ రంగులో, 5.4 అడుగుల ఎత్తు, సుమారు 20–25 ఏళ్ల వయస్కురాలని తెలిపారు. నలుపు రంగు పంజాబీ డ్రెస్ వేసుకుందని చెప్పారు. మృతురాలి వివరాలు తెలిసిన వ్యక్తులు 8712685242, 8712685241, 8712685028 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని మల్లంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తడుక రాజు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడిపోయాడు. రాజుకు తీవ్ర గాయాలు కావడంతో తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. రాజును ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని సర్పంచ్ చుక్క రమేశ్ కోరారు.

పరామర్శ



నర్సంపేట : నర్సంపేటకు చెందిన ఏఐసీసీ ఓబీసీ సెల్ నేషనల్ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామిగౌడ్‌తోపాటు సోదరులు మల్లయ్య, జనార్దన్‌లను వారి తల్లి తిరుపతమ్మ ఇటీవల మృతి చెందిన సందర్భంగా మోకుదెబ్బ నాయకులు ఎలికట్టె విజయ్‌కుమార్, అనంతుల రమేశ్ శుక్రవారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తీగల జీవన్, బైరి రవికృష్ణ, సొర్తి సారయ్య, గోడిశాల సదానందం, గోపగాని వెంకట్, తోటకూరి రాందాస్, గంప రాజేశ్వర్, మద్దెల సాంబయ్య, గండి లింగయ్య పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుడికి..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని నంబర్ 1 కాలనీకి చెందిన మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సాధు నర్సింగరావు సోదరుడు చిరంజీవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాలమహానాడు నాయకులు పరామర్శించారు. తొలుత చిరంజీవి చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోతి విష్ణు, న్యాయవాది మోటూరి రవి, జిల్లా కార్యదర్శి కునుమల కమలాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పోతరాజు నర్సయ్య, పత్రి కుమారస్వామి, పడిదం రాజేందర్, కడగండ్ల యాకయ్య తదితరులున్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి సమీప పాకాలవాగు ఒడ్డున వెలసిన శ్రీమేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రదేశాన్ని శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమార్ సందర్శించారు. ఈనెలలో జాతర జరగనున్న దృష్ట్యా శాశ్వత రహదారి ఏర్పాట్లు, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు.

హైస్కూల్‌లో సైన్స్ టీచర్ల కొరత



పర్వతగిరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బయాలాజికల్ సైన్స్ టీచర్ల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ టీచర్ డిప్యూటేషన్‌పై వెళ్లడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బయాలాజికల్ సైన్స్ టీచర్ కొరత మూడు నెలలుగా వేధిస్తోంది. పాఠశాలలో 327 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 15 మంది ఉపాధ్యాయులు ఉండగా బయోలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ కనీజ్‌పానిమా హైదరాబాద్ ఎస్ఎస్ఏలో పని చేస్తున్నారు. డీఈఓ, విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆమె పర్వతగిరి నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు తెలిపారు. పాఠశాలలో మూడు బయోలాజికల్ సైన్స్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో ఇద్దరు టీచర్లు బదిలీ కాగా ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. పదో తరగతిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో 65 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు బయాలాజికల్ టీచర్ల అవసరం ఉన్న నేపథ్యంలో ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉండాలి



ప్రభుత్వ హైస్కూల్‌లో అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉండేలా చూడాలి. డిప్యూటేషన్‌పై వెళ్లిన టీచర్లను వెనక్కి తీసుకురావాలి. బయాలాజికల్ టీచర్ల కొరత ఉన్న నేపథ్యంలో డిప్యూటేషన్‌పై ఒకరిని పంపడం సరికాదు. విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలయ్యే ప్రమాదం ఉంది.

–బొట్ల మహేంద్ర, ఎంపీటీసీ, పర్వతగిరి

టీచర్ల కొరత నివారణకు చర్యలు



పర్వతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో టీచర్ల కొరత ఉంది. ఈ క్రమంలో ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో డిప్యూటేషన్‌పై హైస్కూల్‌లో పని చేయిస్తున్నాం. టీచర్ల కొరత నివారణకు చర్యలు తీసుకుంటాం.

–చదువుల సత్యనారాయణ, ఎంఈఓ

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణతే ధ్యేయం



మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయ

వర్ధన్నపేట : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ చేపడుతున్నట్లు ఇల్లంద కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.విజయ తెలిపారు. మండలంలోని ఇల్లంద గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో కేజీబీవీ, చెన్నారం, నల్లబెల్లి, ఉప్పరపల్లి, కట్ర్యాల గ్రామాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా నిపుణులైన ఉపాధ్యాయులతో బోధిస్తున్నట్లు తెలిపారు. చురుకైన విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా సంసిద్ధులను చేస్తున్నామని చెప్పారు. మిగితా పిల్లలకు ప్రత్యేక తరగతుల ద్వారా నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్జెక్టు నిపుణులైన ఉపాధ్యాయులు ప్రభ, వంశీమోహన్, హసన్‌అలీ, మనుజేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, రాజు పాల్గొన్నారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి జాతర

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలోని స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తృతీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జాతరను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ వేడుక చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు పద్మ, జెడ్పీటీసీ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త మాద్రాజు వెంకన్న రేణుక, ఐలయ్య, మల్లికార్జున్, భిక్షపతి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న భక్తులు

‘లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి’

నర్సంపేట : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొరబోయిన కుమారస్వామి కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. గడచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, తదితర అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి మతోన్మాద ధోరణితో మోసపూరిత పాలన సాగిస్తోందని తెలిపారు. యువత ఉద్యోగాలు కోల్పోయారని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుపరమయ్యాయని, నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగి పేదలు కుటుంబ పోషణకు సతమతమౌతున్నారని చెప్పారు. ప్రజల దృష్టి మరల్చి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు మత విద్వేషాలు రెచ్చగొడుతోందంటూ బీజేపీ వైఖరిని ఎండగట్టారు. కేంద్ర బడ్జెట్ సామాన్యులకు అనుకూలం కాదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అన్వర్, కత్తి కట్టయ్య, పెండ్యాల సారయ్య, కమతం వెంకటేశ్వర్లు, రాజులపాటి సూరయ్య, బసిక మొగిలి, రుద్రారపు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో మానవ విలువలు కీలకం

వర్ధన్నపేట : జీవితంలో మానవ విలువలు కీలకమని ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త వంక మాణిక్యరావు తెలిపారు. మండలంలోని రాంధన్ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రాజేశ్వర్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి మాణిక్యరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే మానవ విలువలు పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడంతోపాటు ఇతరుల పట్ల ప్రేమ దయ, జాలి, కలిగి ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, అత్యున్నత అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని వివరించారు. విద్యార్థులకు పాటలు, నృత్యాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మచారి, అంగన్‌వాడీ టీచర్ విజయ, వాటర్‌మెన్ గోపీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్యస్నేహితుల ఔదార్యం



బాండ్ అందజేస్తున్న కుమారస్వామి స్నేహితులు

నర్సంపేట : నర్సంపేటకు చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి టెన్త్ నాటి బాల్యస్నేహితులు రూ.లక్ష 5,116 సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. ఈ మేరకు కుమారస్వామి చిన్న కూతురు పేరిట సదరు డబ్బును అతడి మిత్రులు బ్యాంకులో డిపాజిట్ చేసి బాండ్ పత్రాలను శుక్రవారం అందజేశారు. కుమారస్వామి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కుమారస్వామి స్నేహితులు మండల శ్రీనివాస్, ఎస్.విజయ్‌కుమార్, పాలాయి శ్రీనివాస్, పుట్టపాక కుమారస్వామి, కోడెం సారంగపాణి, బాణాల శ్రీనివాస్, సోమ వెంకట్, కత్తి వెంకట్, రాజేశ్వర్, రాజేందర్, సుంకరి శ్రీను, శ్యాంసింగ్, రాజేశ్వరాచారి, ప్రభాకర్, తిరుపతి, సురేశ్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



సాంబయ్య

ఖానాపురం : మున్నూరుకాపు సంఘం ఖానాపురం గ్రామ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగం సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా గొట్టం సోమయ్య, కార్యదర్శిగా పి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అన్నం ప్రకాశ్, గౌరవ సలహాదారుగా భిక్షమయ్య, సభ్యులుగా సత్యం, మానెపల్లి వెంకన్న, రవీందర్, వీరన్న, మోహన్, వెంకన్న, గాంధీ, కొంరయ్య, చంద్రయ్య ఎన్నికయ్యారు.

బీరప్ప పరపతి సంఘం వార్షికోత్సవం

రాయపర్తి : మండలంలోని మొరిపిరాల గ్రామంలో బీరప్ప పరపతి సంఘం వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చేగూరి మల్లేశ్ మాట్లాడారు. సంఘాన్ని నాలుగేళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘంతో సభ్యులందరూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కుమార్, మరాటి రవి, ఏనుగ యాకన్న, జోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్



నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ ఉద్యోగులకు నిరాశ కలిగించిందని చెప్పారు. విద్యాసంస్థల్లో పోస్టుల భర్తీ ప్రస్తావించలేదన్నారు. ఆర్థిక మాంద్యం పేరుతో రూ.35 వేల కోట్ల బడ్జెట్‌ను తగ్గించడంతో ప్రభుత్వ డొల్లతనం బయట పడిందన్నారు. బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు నష్టం కలిగించేలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ చెన్నారావుపేట మండల కార్యదర్శి జన్ను రమేష్, ఏఐసీటీయూ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మాషూక్, ప్రకాశ్ పాల్గొన్నారు.



సంగెం : బాధ్యతలు చేపడుతున్న రాజ్‌కుమార్



ఖానాపురం : విధుల్లో చేరుతున్న సుమనవాణి

విధుల్లో చేరిన ప్రత్యేకాధికారులు

సంగెం : పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన క్రమంలో ప్రత్యేకాధికారులు శుక్రవారం విధుల్లో చేరారు. తాజా మాజీ సర్పంచ్‌ల నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రత్యేకాధికారులుగా సంగెంకు తహసీల్దార్ బి.రాజ్‌కుమార్, గవిచర్లకు ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఆశాలపల్లికి ఎంపీఓ కొముదయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారులను పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్, అయోధ్యనగర్‌లకు ఏఓ శ్రీనివాస్, వేపచెట్టుతండ, నాజీతండాలకు ఇరిగేషన్ ఏఈ రమేశ్‌బాబు, బుధరావుపేట, చిలుకమ్మనగర్‌లకు ఎంపీఓ రవి, చిలుకమ్మతండ, కీర్యతండ, దబ్బీర్‌పేటలకు ఇరిగేషన్ ఏఈ స్నేహిత, ధర్మరావుపేట, భద్రుతండలకు ఐబీ ఏఈ స్వాతి, ఖానాపురం, రాగంపేటలకు తహసీల్దార్ కిరణ్‌కుమార్, కొత్తూరు, రంగాపురంలకు ఎంపీడీఓ సుమనవాణి, మనుబోతులగడ్డ, బండమీది మామిడితండాలకు ఐబీ ఏఈ అనిత, కొడ్తిమాటు తండ, మంగళవారిపేట, బోటిమీదితండాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక బాధ్యతలు చేపట్టారు.

నల్లబెల్లి : మండలంలోని అర్వనపల్లి, రంగాపురం, రామతీర్థం గ్రామ పంచాయతీలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, అర్వయ్యపల్లి, శనిగరంలకు ఇరిగేషన్ డీఈఈ రవి, బుచ్చిరెడ్డిపల్లి, కన్నారావుపేటలో ఏఓ పరమేశ్వర్, ముచ్చింపుల, ముచ్చింపుల తండాలో డీటీ మధుసూదన్, దస్తగిరిపల్లి, ధర్మరావుపల్లిలో ఏఈ సంగీత, నల్లబెల్లి, కొండాయిల్‌పల్లిలో తహసీల్దార్ రాజేశ్, మేడపల్లి, గొల్లపల్లి, ఆసరవెల్లిలో పశువైద్యాధికారి సురేశ్, మూడుచెక్కలపల్లి, మామిండ్లవీరయ్యపల్లి, నాగరాజుపల్లిలో ఏఈ సత్యనారాయణ, నారక్కపేట, రాంపూర్‌లో ఎంపీడీఓ విజయ్‌కుమార్, గుండ్లపహాడ్, బజ్జుతండాలో ఏఈ ప్రభావతి, నందిగామ, రేలకుంటలో నల్లబెల్లి పశువైద్యాధికారి శ్రీనాథ్, గోవిందాపూర్, కొండాపూర్‌లో ఏఈఈ పవిత్ర, రుద్రగూడెం, లెంకాలపల్లిలో ఎంపీఓ ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేకాధికారులకు తాజా మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు.

దుగ్గొండి : మండలంలోని అడవి రంగాపురం, రాజ్యతండా, మదిర గ్రామాల ప్రత్యేకాధికారిగా డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, బంధపల్లి, కేశవాపురం, లక్ష్మీపురం గ్రామాలకు ఎస్సారెస్పీ ఏఈ సతీశ్, చలపర్తి, నారాయణతండా, తిమ్మంపేటలకు మండల వ్యవసాయ అధికారి దయాకర్, దేశాయిపల్లి, గుడిమహేశ్వరం, దుగ్గొండి గ్రామాలకు తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, మహ్మదాపురం, మద్రిపల్లి, బొబ్బరోనిపల్లిలకు ఇరిగేషన్ డీఈ రామకృష్ణ, మల్లంపల్లి, చంద్రయ్యపల్లి, గొల్లపల్లిలకు పశువైద్యాధికారి రామ్మోహన్, మందపల్లి, పీజీతండా, చాపలబండలకు పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ముద్దునూరు, మైసంపల్లి, గుడ్డెలుగులపల్లి, స్వామిరావుపల్లిలకు పశువైద్యాధికారి బాలాజీ, బిక్కాజిపల్లి, పొనకల్, నాచినపల్లిలకు మండల పంచాయతీ అధికారి శ్రీధర్‌గౌడ్, శివాజీనగర్, రేకంపల్లి, వెంకటాపురంలకు ఎంపీడీఓ కృష్ణప్రసాద్, రేబల్లె, గిర్నిబావి, తొగర్రాయిల్లో పశువైద్యాధికారి శారద బాధ్యతలు స్వీకరించారు.



నల్లబెల్లి : రాజేశ్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్



దుగ్గొండి: బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

జీపీ మాజీ పాలకవర్గాలకు సన్మానం



ఖానాపురం : సన్మానిస్తున్న ఎంపీపీ, ఇతరులు



చెన్నారావుపేట : సన్మానిస్తున్న నాయకులు



నల్లబెల్లి : పాలకవర్గంతో జీపీ కార్యదర్శి విష్ణు



రాయపర్తి : సన్మానిస్తున్న అధికారులు, ఇతరులు

ఖానాపురం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తాజాగా పదవీ విరమణ చేసిన సర్పంచ్‌ను, ఉపసర్పంచ్‌ను, వార్డు సభ్యులను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఎస్సై మాధవ్‌గౌడ్ శుక్రవారం సన్మానించారు. అనంతరం ఎంపీపీ, ఎస్సై మాట్లాడారు. రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, జీపీ కార్యదర్శి సట్ల సుప్రజ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ సర్పంచ్ తూటి పావని, ఉపసర్పంచ్ బానోతు వీరన్ననాయక్, వార్డు సభ్యులు ఆకుల అశోక్, ఇస్లావత్ స్వామి, ఈర్ల అనూష, భూక్య రవి, బొంత రజితతోపాటు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ ఒంటరి అనిత, సిబ్బంది కొరెడ్ల రాజు, నాయిని శేఖర్, బోనగిరి కొమ్మాలులను సన్మానించారు. అనంతరం తాజా మాజీ సర్పంచ్ పావని మాట్లాడారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. తమకు సహకరించారంటూ ప్రజలకు, అధికారులకు, వార్డు సభ్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు పులిశేరు రాజేందర్, భూక్య సురేశ్, వీరూనాయక్, వెంకన్న, కరుణాకర్‌రెడ్డి, శోభన్ పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని కొండాయిల్‌పల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. అనంతరం తాజా మాజీ సర్పంచ్ మామిండ్ల మోహన్‌రెడ్డి మాట్లాడారు. తన పదవీ కాలం ముగిసినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండి రెట్టింపు ఉత్సాహంతో గ్రామాభివృద్ధికి పాటుపడుతానని చెప్పారు. అధికారులు, ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విష్ణు, ఉపసర్పంచ్ కొలగాని సదయ్య, వార్డు సభ్యులు ముకుందరెడ్డి, ఇన్నాషమ్మ, రజని, హైమ, రాంచంద్రు, శౌరెడ్డి, సొందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని 39 గ్రామాల పంచాయతీ పాలకవర్గాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అధ్యక్షతన షీల్డ్‌లు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ గుగులోతు కిషన్, ఎంపీఓ రామ్మోహన్, ఎంపీటీసీలు బిల్లా రాధిక, ఐత రాంచందర్, కారోబార్ మల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా ‘ఉపాధి హామీ’ దినోత్సవం



గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంఈడీఓ వీరేశం మాట్లాడారు. 2006 ఫిబ్రవరి 2న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. గడచిన 18 ఏళ్లలో పథకం ద్వారా గ్రామీణ పేదలు లబ్ధి పొందారని చెప్పారు. ఉపాధి కూలీలకు స్వీట్లు పంపిణీ చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌ను శాలువాతో సన్మానించారు.

పల్లె దవాఖాన ప్రారంభమెప్పుడు?



నర్సంపేట రూరల్ : గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామానికి ఒక ఏఎన్ఎం సెంటర్ తాత్కాలికంగా అద్దె భవనాల్లో ఏర్పాటు చేసింది. మరింత మెరుగైన సేవల కోసం పక్కా భవనాన్ని నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఆర్నెళ్లు గడచినా పక్కా భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అద్దె భవనాల్లోనే రోగులకు చికిత్స చేస్తున్న దుస్థితి నెలకొంది. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ ప్రజలకు మెరుగైనా వైద్యసేవలు అందించే పేరుతో నాటి ప్రభుత్వం రూ.16 లక్షల వ్యయంతో పక్కా భవన నిర్మాణం చేపట్టింది. ఏడు నెలల క్రితం పనులను పూర్తి చేసినా గత ఎన్నికల సందర్భంగా ప్రారంభం నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లె దవాఖానాను ప్రారంభించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్కా భవనంలో పల్లె దవాఖానా ప్రారంభమైతేనే మెరుగైనా వైద్యసేవలు అందుతాయని ఆశిస్తున్నారు.

6 వరకే పట్టభద్రుల ఓటరు నమోదు



నర్సంపేట : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఈనెల 6 వరకే గడువు ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ తెలిపారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. గతంలో ఓటు హక్కు ఉన్నప్పటికీ మళ్లీ నమోదు చేసుకోవాలని తెలిపారు. 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు గూడూరు సందీప్, పంజాల రాము, బూత్ కమిటీ అధ్యక్షుడు విజయ్‌సింగ్, రమేశ్ పాండ్య, తదితరులు పాల్గొన్నారు.